
సాక్షి అనంతపురం

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.17

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/21.5°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ నెల 1న 0.4 మి.మీ, 2న 0.2 మి.మీ, 3న 2.4 మి.మీ, 4న 5.5 మి.మీ, 5న 6.2 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 32.2 డిగ్రీల నుంచి 32.7 డిగ్రీలు, రాత్రిళ్లు 22.8 డిగ్రీల నుంచి 23.2 డిగ్రీల మధ్య ఉండొచ్చన్నారు.

గొర్రె పిల్లలను మింగిన కొండచిలువ



రెండు గొర్రె పిల్లలను చంపిన కొండ చిలువ

పుట్టపర్తి అర్బన్: మందలో ఉన్న రెండు చిన్న గొర్రె పిల్లలను కొండ చిలువ మింగింది. ఈ ఘటన పుట్టపర్తి మండలం పైపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి పొద్దుపోయాక సమీపంలోని కొండ నుంచి వచ్చిన భారీ కొండ చిలువ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి విజయ్ మందలోకి చొరబడింది. ఒక పిల్లను మింగేసింది. రెండవ పిల్లను నోట కరుచుకోవడంతో అరుపులు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన విజయ్ తోటి కాపరుల సహకారంతో రెండవ పిల్లను కొండ చిలువ నోటి నుంచి లాగేశారు. అప్పటికే అది మృతి చెందింది. కొండచిలువ ఎటూ వెళ్లలేక మంద లోనే ఉండడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు పుట్టపర్తికి చెందిన కరుణ సొసైటీ సిబ్బందికి తెలపడంతో వారు వచ్చి కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని బుక్కపట్నం సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోకి వదిలేశారు.

పీహెచ్‌సీలకు 54 మంది వైద్యుల కేటాయింపు

అనంతపురం మెడికల్: జిల్లాలోని పలు పీహెచ్‌సీలకు 54 మంది వైద్యులను కేటాయించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు పీహెచ్‌సీల డాక్టర్లు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీలకు వైద్యులను సర్దుబాటు చేశారు. ఏరియా ఆస్పత్రుల నుంచి 28 మంది, ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి 26 మంది వైద్యులను పంపినట్లు డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. 104,108 సిబ్బంది కూడా అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు.

చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో విశ్వక్సేనుల ఉత్సవ విగ్రహం

తాడిపత్రి రూరల్: పట్టణంలో భూదేవి, శ్రీదేవి సమేత చింతల వేంకట రమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విశ్వక్సేన సేవ జరిగింది. ఆలయం చుట్టూ విశ్వక్సేనుల ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవాలయం విద్యుద్దీపాలంకరణల నడుమ కొత్త శోభ సంతరించుకుంది.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి : జేసీ

అనంతపురం అర్బన్: కార్డుదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లను జేసీ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చౌక ధరల దుకాణాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్డుదారులు పోర్టబిలిటీ ద్వారా తమకు దగ్గరలోని ఏ చౌక దుకాణం వద్దనైనా సరుకులు తీసుకోవచ్చన్నారు. సరుకుల పంపిణీలో ఎలాంటి సమస్యలున్నా కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ 85002 92992కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కొనసాగుతున్న కూటమి కోతలు

- మొదట కందిపప్పు దూరం
- తాజాగా జొన్నలు, రాగుల పంపిణీకి మంగళం
- బియ్యం, చక్కెరతోనే సరి
- పేదలపై మోయలేని భారం



రేషన్ కోసం చౌక దుకాణం వద్ద క్యూలో నిల్చున్న కార్డుదారులు (ఫైల్)

రేషన్ కట్ కటా!

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో పేదలకు సంక్షేమం కనుమరుగవుతోంది. రేషన్‌లో 'కోత' కొనసాగుతోంది. కార్డుదారులకు సరుకులను ఒక్కొక్కటిగా దూరం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కందిపప్పు పంపిణీ నిలిపేశారు. కాదు కాదు.. ఎగనామం పెట్టారు! పేదలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన జొన్నలు, రాగుల పంపిణీకి తాజాగా కూటమి సర్కారు మంగళం పాడింది. గత నెల వరకు జొన్నలను అరకొరగా స్టోర్లకు సరఫరా చేస్తూ వచ్చిన ప్రభుత్వం.. అక్టోబరుకు సంబంధించి చౌక దుకాణాలకు జొన్నలు, రాగుల సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. జిల్లావ్యాప్తంగా కార్డుదారులకు కిలో కందిపప్పు చొప్పున నెలసరి కోటా 615 టన్నులు, అదే విధంగా జొన్నలు 1,100 టన్నులు, రాగులు 1,100 టన్నులు కేటాయించాల్సి ఉన్నా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కందిపప్పు పంపిణీ చేయడం లేదు. మూడు నెలలుగా అరకొరగా జొన్నలు పంపిణీ చేస్తూ వచ్చిన ప్రభుత్వం నేడు పూర్తిగా ఎగనామం పెట్టేసింది. అదే బాటలో రాగుల పంపిణీని కూడా నిలిపివేసింది.

పేదలపై భారం

కందిపప్పు, జొన్నలు, రాగులను ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో పేదలు బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతి కుటుంబం నెలకు ఒక కిలో కందిపప్పు, మూడు కిలోల జొన్నలు, ఒక కిలో రాగులు వినియోగిస్తారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రూ.67తో, జొన్నలు, రాగులు మూడు కిలోలు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.130, జొన్నలు రకాన్ని బట్టి కిలో రూ.40 నుంచి రూ.60 వరకు, రాగులు కిలో రూ.50 వరకు పలుకుతున్నాయి. సర్కారు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారులు మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కిలో కంది పప్పుపై రూ.73 అదనంగా, మూడు కిలోల జొన్నలకు రూ.120 నుంచి రూ.180, రాగులకు కిలో రూ.50 చొప్పున వెచ్చించాల్సి వస్తోంది.

ఇచ్చిందీ గతంలో కొనుగోలు చేసినవే..!

కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా కందిపప్పు కిలో రూ.67తో అందించాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అసలు కొత్తగా కందిపప్పు కొనుగోలు చేసిందే లేదు. గత ప్రభుత్వం కొనుగోలు చేసి నిల్వ చేసిన స్టాక్ ఉన్నంత వరకే కందిపప్పును పంపిణీ చేయడం గమనార్హం.

ఏడు నెలలుగా అదే మాట..

రేషన్ కోతపై అధికారులు చెప్పే కారణాలు వింటే విస్తుపోవాల్సిందే. కందిపప్పు సరఫరాకు సంబంధించిన ప్రక్రియ ఇంకా టెండర్ దశలో ఉందని ఏడు నెలలుగా చెబుతుండడం చూస్తే సార్లూ 'ఏమి సెప్తిరి' అని ఎవరికైనా అనిపించకపోదు. జొన్నలు, రాగుల విషయానికి వస్తే స్టాక్ అయితే ఉందట.. కాకపోతే ఆన్‌లైన్‌లో సమస్య కారణంగా స్టోర్లకు సరఫరా చేయలేకున్నామని చెప్పడం గమనార్హం.

కోతలు... వాతలు కనిపించవా?

గత ప్రభుత్వ హయాంలో ప్రతినెలా నాణ్యమైన కందిపప్పు, జొన్నలు, రాగులు పంపిణీ చేశారు. అయినా కొందరు పనిగట్టుకుని అసత్య ప్రచారం చేశారు. ఆ 'పచ్చ' కళ్లకు నేడు కోతలు.. వాతలు కనిపించడం లేదనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.

జిల్లాలో...	
మొత్తం చౌక ధరల దుకాణాలు	1,645
బియ్యం కార్డులు	6,60,330
కార్డుల్లో సభ్యులు (యూనిట్లు)	20,54,771
నెలసరి కందిపప్పు కోటా	615 టన్నులు
నెలసరి జొన్నల కోటా	1,100 టన్నులు
నెలసరి రాగుల కోటా	1,100 టన్నులు
కందిపప్పు పంపిణీ ఆపేసింది	ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి
జొన్నలు, రాగుల పంపిణీ నిలిపివేత	ఈ నెల నుంచి పూర్తిగా

ధర్మవరం వరకు 'సూపర్ ఫాస్ట్' పొడిగింపు

- సత్యసాయి జయంత్యుత్సవాల నేపథ్యంలో రైల్వే శాఖ నిర్ణయం



కదిరి: గుంటూరు – తిరుపతి మధ్య నడుస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు (17261)ను ధర్మవరం వరకూ పొడిగించారు. భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి (నవంబర్ 23)ని పురస్కరించుకొని రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు అంటే రెండు నెలల పాటు ఈ రైలు ధర్మవరం వరకు నడుపుతారు. ఆ తర్వాత ఎప్పటి లాగానే తిరుపతి వరకూ వచ్చి ఆగిపోతుంది. రోజూ సాయంత్రం 4.30 గంటలకు రైలు గుంటూరులో బయలుదేరుతుంది. నరసరావుపేట, వినుకొండ, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లి, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, కమలాపురం, రాజంపేట మీదుగా ప్రయాణించి తెల్లవారుజామున 3.55 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.05 గంటలకు బయలుదేరి పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి రోడ్, ములకలచెరువు, కదిరి మీదుగా ఉదయం 9 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. ధర్మవరంలో మధ్యాహ్నం 1.20కి బయలు దేరి తిరుగు ప్రయాణంలో సాయంత్రం 7.15కు తిరుపతి చేరుకుంటుంది. అక్కడ 10 నిమిషాలు మాత్రమే ఆగి.. తర్వాత బయలుదేరి మరుసటి దినం ఉదయం 7.20 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఈ రెండు నెలల పాటు రోజూ ఒక రైలు (17261) గుంటూరులో సాయంత్రం 4.30కు బయలుదేరితే, ఇంకో రైలు (17262) ధర్మవరంలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరేలా రైల్వేశాఖ నిర్ణయించింది.

పేద విద్యార్థులు వైద్య విద్య చదవొద్దా?

- దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ హయాంలో 17 వైద్య కళాశాలలు
- బాబు నిర్ణయంతో నిరుపేద విద్యార్థులకు అందని ద్రాక్షగా వైద్య విద్య
- కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సిందే
- భవిష్యత్తులో చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెబుతారు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుల హెచ్చరిక



చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు మాట్లాడుతూ సీఎంగా ఉన్న సమయంలో దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు కావాలని, తమ విద్యార్థులకు ఎక్కువ సీట్లు కేటాయించాలని కోరిన ప్రభుత్వాలను చూశాం కానీ, మెడికల్ కళాశాలలు తాము నిర్వహించలేమంటూ కేంద్రానికి లేఖ రాసిన ఏకైక ప్రభుత్వం ప్రస్తుత కూటమి సర్కారే అని దుయ్యబట్టారు. ఒక్కో కళాశాలలో 15 శాతం సీట్లు కేంద్రం భర్తీచేస్తే తక్కిన 85 శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉచితంగా వైద్యవిద్య చదివే వీలుండేదన్నారు. అలాంటిది ఉన్న కళాశాలలన్నీ ప్రైవేట్ పరం చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. నగర మేయర్ వసీం మాట్లాడుతూ మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడం దుర్మార్గమన్నారు. నిర్వహణ సాధ్యం కాదని కేంద్రానికి లేఖ రాసిన ఘనత ఈ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఎస్సీ సెల్ రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు పెన్నోబులేసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, రాష్ట్ర కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప మాట్లాడుతూ పీపీపీ విధానం మాటున ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారన్నారు.రాష్ట్రంలో పేద విద్యార్థులు వైద్యవిద్య చదువుకోకూడదా? అని ప్రశ్నించారు. ప్రైవేట్‌గా మెడికల్ సీటు పొందాలంటే రూ.80 లక్షల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని, పేద వర్గాలకు ఇది సాధ్యమేనా అని వాపోయారు. పేదలను వంచిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, మైనార్టీ, ఎస్టీ, మహిళ, విద్యార్థి విభాగాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, శ్రీనివాసనాయక్, శ్రీదేవి, చంద్రశేఖర్‌యాదవ్, పార్టీ నాయకులు పసలూరు ఓబులేసు, రాఘవ, రాఘవేంద్రప్రసాద్, సాకే శంకర్, ఎగ్గల శ్రీనివాసులు, గౌస్‌బేగ్, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మారుతీ నాయుడు, నరేంద్రరెడ్డి, ఆంజనేయులు, కాటమయ్య, సాకే కుళ్లాయిస్వామి,అశోక్, ప్రియాంక, వెన్నం శివరామిరెడ్డి, మారుతీప్రసాద్, రామాంజనేయులు, శోభారాణి, శోభాబాయి, కమల్ భూషణ్, కైలాస్, నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

'రబీ' వచ్చేసింది

- సీజన్‌లో 1.20 లక్షల హెక్టార్లలో పంటల సాగు అంచనా
- ప్రధాన పంటగా 70 వేల హెక్టార్లలో పప్పుశనగ
- ఈశాన్యంతో 139.3 మి.మీ సాధారణ వర్షపాతం!



పప్పుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి మొదలైన ఖరీఫ్ సీజన్ ముగిసింది. బుధవారం నుంచి రబీ సీజన్ మొదలు కానుంది. డిసెంబర్ నెలాఖరు వరకు 'రబీ'గా పరిగణిస్తారు. ఆ తర్వాత జనవరి, ఫిబ్రవరి చలికాలం, మార్చి నుంచి వేసవి మొదలవుతుంది. ఖరీఫ్‌లో 2.98 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ, కంది, పత్తి, మొక్కజొన్న, ఆముదం తదితర ప్రధాన పంటలు సాగులోకి వచ్చాయి. రబీలో జిల్లాలో ప్రధాన పంటగా పప్పుశనగ 70 వేల హెక్టార్లకు పైబడి సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ రబీలో 1.20 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావొచ్చని అంచనా వేశారు. అందులో ప్రధానంగా పప్పుశనగతో పాటు వేరుశనగ 20 వేల హెక్టార్లు, మిగతా అన్ని పంటలు కలిపి మరో 30 వేల హెక్టార్ల వరకు సాగులోకి రావొచ్చని చెబుతున్నారు. రబీ సీజన్‌లో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సాధారణ వర్షపాతం 139.3 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. అందులో అక్టోబర్‌లోనే అత్యధికంగా 100.9 మి.మీ, నవంబర్‌లో 28.6 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ నమోదు కావాలి.

ముందస్తు సాగుకు సిద్ధం..

ఖరీఫ్‌కు సంబంధించి జూన్, జూలైలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గడంతో రబీలో ముందస్తు సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నల్లరేగడి భూముల్లో పప్పుశనగతో పాటు మొక్కజొన్న, జొన్న తదితర పంటలు విత్తుకునేందుకు విత్తనం కోసం ఎదురుచూస్తున్నారు. అనంతపురం, ఆత్మకూరు, కూడేరు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, బెళుగుప్ప, బొమ్మనహాళ్, కణేకల్లు, డీ.హిరేహాళ్, గుత్తి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, పామిడి, శింగనమల, యాడికి, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు మండలాల్లో విత్తన పంపిణీ చేపట్టాల్సి ఉంది. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు నెల రోజుల పాటు పప్పుశనగ సాగుకు మంచి అదనుగా చెబుతున్నా... వర్షాలు వస్తే ముందుగానే సాగుకు రైతులు రెడీగా ఉన్నారు. కానీ కూటమి సర్కారు, వ్యవసాయశాఖ ఇప్పటికీ విత్తన పంపిణీ ప్రక్రియ మొదలు పెట్టలేదు. గతేడాది 27,129 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ కేటాయించగా... ఈ సారి 14 వేల క్వింటాళ్లకు కుదించారు. సబ్సిడీ కూడా 40 శాతం నుంచి 25 శాతానికి పరిమితం చేయడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. గత ఖరీఫ్, రబీ, ఈ ఖరీఫ్‌లో పంపిణీ చేసిన వేరుశనగ, పప్పుశనగ, కందులు, విత్తన వరి తదితర వాటికి సంబంధించి కూటమి సర్కారు ఏపీ సీడ్స్ ద్వారా ఏజెన్సీలకు బకాయిలు చెల్లించలేదు. దీంతో విత్తన సేకరణ, సరఫరా, పంపిణీ ఈ సారి జాప్యమయ్యే పరిస్థితి నెలకొంది. అలాగే ఏఓలు, ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు నాన్‌సబ్సిడీ కింద రైతుల నుంచి వసూలు చేసిన సొమ్ము పూర్తి స్థాయిలో ఏపీ సీడ్స్‌కు చెల్లించకపోవడం కూడా సమస్యగా మారిందని చెబుతున్నారు. ఇక.. అక్టోబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు రబీ కింద నీటి వసతి సదుపాయం కలిగిన ప్రాంతాల్లో వేరుశనగ సాగుకు వీలుగా రాయితీ విత్తన పంపిణీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇళ్ల నిలుపుదల పాపం ప్రభుత్వానిదే

- నిరుపేదల నుంచి ఒక్కో ఇంటికి రూ. 10 వేలు వసూలు చేస్తారా?
- కూటమి బాధితులకు జగనన్న అభయం 'డిజిటల్ బుక్'
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడురూరల్: 'పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత ప్రభుత్వం కేవలం రూ. 1.80 లక్షలకే ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఈ పనులను నిలిపివేసింది. పేదల ఇళ్ల నిర్మాణాలను నిలుపుదల చేసిన పాపం ఈ ప్రభుత్వానిదే' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం అనంతపురం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో 'డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ బాధితులకు జగన్ ఇచ్చిన అభయం డిజిటల్ బుక్ అన్నారు.

మిథున్‌రెడ్డిది అక్రమ అరెస్ట్..

ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. 2014–19 మధ్య లిక్కర్ అమ్మకాల ద్వారా రూ. 70 వేల కోట్ల ఆదాయం పొందితే, జగన్ హయాంలో 2019–24 మధ్య రూ.1.5 లక్షల కోట్లకు ఆదాయం పెరిగిందని, ఆదాయం పెరిగిన ప్రభుత్వంలో స్కాం జరిగిందా? లేకుంటే ఆదాయం తగ్గిన చంద్రబాబు హయాంలో స్కాం జరిగిందా ఆలోచించాలన్నారు. ఓటుకునోటు కేసులో చంద్రబాబు ఎలా అడ్డంగా దొరికాడో దేశానికే తెలుసని,స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో అనారోగ్య సమస్యలపై బెయిల్ వచ్చిందనేది అందరికీ తెలుసన్నారు.

విజిలెన్స్‌తో ఏం తేల్చారు?

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారని, అయితే ఇప్పటిదాకా ఏమి తేల్చారని ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. అనంతపురం రూరల్ మండలంలో ఇళ్ల నిర్మాణాలు జరగకుండా ఎమ్మెల్యే పరిటాల సునీత ఆపారన్నారు. నేడు ఒక్కో ఇంటిపై అనంతపురం ఎమ్మెల్యే రూ. 10 వేలు, రాప్తాడు ఎమ్మెల్యే రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. 'అదేమైనా మీ నాయన గంటా.. లేకుంటే మీ జేజినాయన ముడుపులు ఏమైనా ఇచ్చారా..' అని ప్రశ్నించారు. అమరావతిలో నాలుగు కంపెనీలకే రూ. వేల కోట్ల పనులు అప్పగించి కమీషన్లు దండుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మట్టి, ఇసుక, చివరకు ఇళ్ల నిర్మాణాల నుంచి కూడా డబ్బులు కావాలా అని ప్రశ్నించారు. ఇంత దోచుకుంటున్నా మెడికల్ కళాశాలల నిర్మాణాలకు రూ. 5 వేల కోట్లు ఖర్చు చేసేందుకు మనసు రాలేదా అని నిలదీశారు. పేదలకు ఉచిత వైద్యంతో పాటు పిల్లలకు వైద్య విద్య అందించాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్ తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తారా అని మండిపడ్డారు. దివంగత నేత వైఎస్సార్ చనిపోయిన తర్వాత దేవుడయ్యాడని, కానీ చనిపోయిన తర్వాత పీడ పోయిందబ్బ అనుకునేలా చేసుకోవద్దని సీఎం చంద్రబాబుకు హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల భానుమతి, అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజి, లాయర్ నాగిరెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, గోవిందరెడ్డి, బండి పవన్, నీరుగంటి నారాయణరెడ్డి, లింగారెడ్డి, సునీల్‌దత్తరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణవి బాధ్యత లేని మాటలు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణవి బాధ్యత లేని మాటలు అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు.అసెంబ్లీలో ఆయన మాట్లాడిన మాటలతో టీడీపీ నేతలకు మొహం ఎక్కడ పెట్టుకోవాలో కూడా తెలియడం లేదన్నారు. 'అమ్మాయి కనిపిస్తే ముద్దయినా పెట్టాలి... కడుపైనా చెయ్యాలి' అని గతంలో మాట్లాడారన్నారు.'నువ్వు కూడా ఇద్దరు ఆడపిల్లల తండ్రివే.. అయినా అలా ఎలా మాట్లాడావు. గ్లాస్ అలా తిప్పి మ్యాన్సన్‌హౌస్ మందు తాగితే అమ్మ పెళ్లామవుతుందా...పెళ్లాం అమ్మవుతుందా' అని నిలదీశారు. సినీనటుడు చిరంజీవిని ఉద్దేశించి 'ఎవడు' అని మాట్లాడతావా? అంటూ మండిపడ్డారు. తల్లిని అవమానించిన వారి పంచన చేరి పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవి తెచ్చుకున్నారని, నేడు అన్నను అవమానిస్తే మాత్రం నోరు ఎత్తడం లేదన్నారు. వైఎస్ జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారమంతా చిరంజీవి రాసిన లేఖ, మహేష్ బాబు, నారాయణమూర్తి మాటలతో పటాపంచలయ్యాయన్నారు.

పండుగ పూట పస్తులేనా?

- అంగన్‌వాడీలకు అందని ఆగస్టు వేతనం
- ముగిసిన సెప్టెంబరు నెల
- సెల్‌ఫోన్‌లు తిరిగిచ్చేశారని ప్రభుత్వం కక్ష!
- దసరా పండుగ సమయంలో డబ్బు లేక అవస్థలు

'మా ప్రభుత్వంలో మాకే ఎదురు తిరుగుతారా? అయితే వారికి జీతాలు ఆపేయండి' అనే ధోరణితో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లపై కూటమి ప్రభుత్వం కన్నెర్రజేసింది. ఫలితంగా తెలుగు పండుగల్లో అతిపెద్దదైన దసరా సమయంలో చేతిలో చిల్లిగవ్వ లేక అంగన్‌వాడీ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండునెలలుగా జీతాలు లేకపోవడంతో మా ఇళ్లలో పండుగ కళ తప్పిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనంతపురం సెంట్రల్/తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ టీచర్లకు పండుగ పూట కూడా పస్తులు తప్పడం లేదు. ఆగస్టు నెల గౌరవ వేతనం సెప్టెంబరు మొదటి వారంలో వారి బ్యాంకు ఖాతాల్లో పడాల్సి ఉండగా సెప్టెంబర్ నెల దాటినా అధికారులు వేయలేదు. జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు, 223 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దసరా పండగకు ఇక కేవలం ఒక రోజు మాత్రమే ఉంది. దసర సెలవుల పేరుతో ఇతర ప్రాంతాల్లో చదువుతున్న పిల్లలు, బంధువుల రాకతో ఇళ్లు కళకళలాడుతున్నాయి. కొత్త దుస్తులు, పిండి వంటలు తదితరాలకు రూ.వేలల్లోనే ఖర్చు ఉంటోంది. అయితే రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అంగన్‌వాడీల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

సెల్‌ఫోన్లు వెనక్కి ఇచ్చినందుకేనా?

ఆగస్టు నెల జీతం రాకపోవడానికి అంగన్‌వాడీ టీచర్లు తమ వద్ద సెల్‌ఫోన్లను అధికారులకు వెనక్కు ఇవ్వడమే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ ద్వారా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే చాలా ఏళ్ల క్రితం మంజూరు చేసిన సెల్‌ఫోన్లు కావడంతో యాప్‌లో నమోదు ప్రక్రియ సకాలంలో జరగక అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బందులు పడుతూ వచ్చారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ



ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లను గత ఆగస్టులో వెనక్కు ఇచ్చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. దీంతో దిగి వచ్చిన ప్రభుత్వం.. గత నెల 25న చర్చలకు ఆహ్వానించింది. ఓ యూనియన్ (ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న) సెల్‌ఫోన్ వినియోగించడానికి సమ్మతించిండంతో అందరూ కూడా సెల్‌ఫోన్లను తీసుకుని పనిచేయాలని హుకుం జారీ చేసింది. దీంతో ప్రభుత్వ వైఖరిని ప్రధాన సంఘాలు వ్యతిరేకించాయి. ఆన్‌లైన్‌లో మాత్రం నమోదు చేయబోమని మాన్యువల్‌గా చేస్తామని స్పష్టం చేశాయి. దీనిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. జీతాలు నిలుపుదలతో అంగన్‌వాడీల మెడలు వంచే కుట్రకు తెరలేపింది. దీంతో ఆగస్టుతో పాటు సెప్టెంబర్ గడిచినా జీతాలు అందలేదు.

జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు	2,302
అంగన్‌వాడీ వర్కర్లు	2,079
మినీ అంగన్‌వాడీ వర్కర్లు	222
అంగన్‌వాడీ హెల్పర్లు	2,079

వెంటనే జీతాలు మంజూరు చేయాలి

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు గత రెండునెలలుగా జీతాలు పడలేదు. ప్రస్తుతం దసరా పండుగ వచ్చింది. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి ప్రస్తుతం తీవ్ర ఇబ్బందిగా మారింది. పండుగ సరుకులు, నూతన దుస్తులు కొనుగోలు చేయలేక చాలా మంది ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు మంజూరు చేయాలి.

– రమాదేవి, జిల్లా కార్యదర్శి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

సమగ్ర శిక్షలోనూ అందని రెన్నెళ్ల జీతాలు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ నిర్వాకంతో సమగ్రశిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అతి పెద్ద పండుగ చేసుకోలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేలమంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, మండల్ లెవెల్ అకౌంటెంట్లు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు, సైట్ ఇంజనీర్లు, ఆయాలు, డీపీఓ సిబ్బంది, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం పేర్లతో వీరంతా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు ప్రతి నెలా జీతం డబ్బులు అందితే గాని కుటుంబ పోషణ జరగదు. అలాంటిది రెండు నెలలుగా వీరికి జీతాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో హిందువుల అతిపెద్ద పండుగ కూడా వచ్చింది. పెద్దల సంగతి పక్కన పెట్టి కనీసం పిల్లలకు కొత్త దుస్తులు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. పండుగ ముందు జీతాలు వస్తాయని ఎదురుచూసినా 30వ తేదీతో అది నిరాశగానే మిగిలింది. ఈ నేపథ్యంలో కొందరు వడ్డీకి అప్పులు చేయగా, మరికొందరు ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్ల వద్ద నగదు బదిలీ తీసుకున్నారు. ఎన్నికల ముందేమో ఉద్యోగులందరికీ 1వ తేదీనే జీతాలు ఇస్తామన్న కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల పట్ల పక్షపాతవైఖరిని అవలంభిస్తుండడం గమనార్హం.



పస్తులు పెడుతున్నారు



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర ఫైనాన్స్ కంట్రోలర్‌ను కలిసి విన్నవించాం. పండుగలోపు రెన్నెళ్ల జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ వేయలేదు. పండుగ పూట ఉద్యోగులను పస్తులు పెడుతున్నారు.

– కె.విజయ్, సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



తాడిపత్రి టౌన్: పట్టణంలోని రామచంద్ర లాడ్జి పక్కన ఉన్న మసీదు వద్ద మంగళవారం ఉదయం ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 60 సంవత్సరాలు పైబడి ఉన్న వ్యక్తి, భిక్షాటనతో జీవనం సాగించేవాడిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతదేహాన్ని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం సాయంత్రం అనంతపురం నుంచి తాడిపత్రికి బయలుదేరిన ఆర్టీసీ బస్సు.. రెడ్డిపల్లి సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద కుడి నుంచి ఎడమ వైపు సర్వీస్ రోడ్డుకు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో సమీపంలోని పొలాల్లోకి లారీ దూసుకెళ్లింది. ప్రమాదంలో బస్సు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పర్యాటకులపై తేనెటీగల దాడి

తాడిపత్రి టౌన్: నియోజకవర్గంలోని యాడికి మండలం కోనుప్పలపాడు సమీపంలో ఉన్న వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటకులపై మంగళవారం తేనెటీగలు దాడి చేశాయి. తాడిపత్రి పట్టణానికి చెందిన ఉదయ్‌కిరణ్, పృథ్వీరాజ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. దసరా పండుగకు తాడిపత్రికి వచ్చి కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం కోన వాటర్ ఫాల్స్ చూసేందుకు వెళ్లారు. అక్కడ సరదాగా గడుపుతున్న సమయంలో తేనెటీగలు దాడి చేసాయి. హుటాహుటిన పిల్లలను వాహనంలో ఎక్కించుకుని దూరంగా రావడంతో పెనుప్రమాదం తప్పింది. ఉదయ్‌కుమార్, పృథ్వీరాజ్ తీవ్ర అస్వస్థతకు గురై తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆర్మీ మద్యాన్ని తరలిస్తూ పట్టుబడిన ఆర్టీసీ డ్రైవర్

అనంతపురం: కర్ణాటక నుంచి ఆర్మీ మద్యాన్ని తరలిస్తూ ఎక్సైజ్ అధికారులకు ఓ ఆర్టీసీ డ్రైవర్ పట్టుబడ్డాడు. వివరాలను అనంతపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ మంగళవారం వెల్లడించారు. అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం బెంగళూరు నుంచి వస్తున్న ఆర్టీసీ అనంతపురంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న శివకోటి ఆలయం వద్ద ఆపి తనిఖీ చేశారు. సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణిస్తున్న శివకోటి ఆలయం వద్ద నివాసముంటున్న ఆర్టీసీ డ్రైవర్ పి.ఓబులనారాయణరెడ్డి వద్ద నుంచి 60 ఆర్మీ ఫుల్ బాటిళ్ల మద్యం పట్టుబడింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అదే బస్సులో ముందు వైపు కూర్చొన్న పాత నిందితులు సాకే పవన్‌కుమార్, వడే శ్రీనివాసులు వెంటనే బస్సు దిగి పారిపోయారు. బెంగళూరులోని ఆర్మీ క్యాంటీన్ నుంచి మద్యం కొనుగోలు చేసి జిల్లాకు అక్రమంగా చేరవేస్తున్నట్లుగా విచారణలో వెలుగు చూసింది.



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : డీఆర్ఎం

గుంతకల్లు: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా భరోసానిచ్చారు. మంగళవారం సాయంత్రం డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌తో పాటు పలువురు నాయకులతో డీఆర్ఎం పీఎన్ఎం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఆర్ఎం దృష్టికి ప్రభాకర్ తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సంఘ్ నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మొండిచేయి చూపిన 'కూటమి'

- వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి

అనంతపురం ఎడ్యుకేషన్: దసరా కానుకగా రెండు డీఏలు, ఐఆర్ 30 శాతం ప్రకటిస్తారని ఎదురు చూసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపిందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలపై చర్చించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి డీఏలు, 30 శాతం మధ్యంతర భృతి, సంపాదిత సెలవుల ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

2 నుంచి ప్రత్యేక రైళ్లు

- షోలాపూర్–ధర్మవరం, బీదర్–బెంగళూరు మార్గంలో..

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. షోలాపూర్–ధర్మవరం, బీదర్–బెంగళూరు మార్గంలో రైళ్లు నడుస్తాయన్నారు. అక్టోబర్ 2 గురువారం రాత్రి 11.20 గంటలకు షోలాపూర్ జంక్షన్‌లో రైలు బయలుదేరి ధర్మవరం జంక్షన్‌కు శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ధర్మవరం జంక్షన్ నుంచి (01438) అక్టోబర్ 4 శనివారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 10.30 గంటలకు షోలాపూర్‌కు చేరుకుంటుందన్నారు. బీదర్, వికారాబాద్, యాదగిరి, కృష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, ములకలచెరువు, కదిరి రైల్వే స్టేషన్ల మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు.



బీదర్–బెంగళూరు మధ్య..

బీదర్–బెంగళూరు మధ్య అక్టోబర్ 4,5 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుస్తాయన్నారు. బీదర్ జంక్షన్ (07063)లో అక్టోబర్ 4 శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు రైలు బెంగళూరు చేరుతుందన్నారు. తిరిగి అక్కడి నుంచి అక్టోబర్ 5 ఆదివారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ చేరుకుంటుందన్నారు. హుమ్నాబాద్, కమలాపూర్, కలబురిగి, షాహబాద్, వాడీ, యాదగిరి, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, యలహంక స్టేషన్ల మీదుగా రైలు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగుడుకు డబ్బివ్వలేదని కొడవలితో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేశన్న

అనంతపురం: మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదంటూ సొంత మేనమామ కొడుకుపైనే కొడవలితో దాడి చేసిన ఘటన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం గ్రామ సింగిల్ విండో ప్రెసిడెంట్ చాకలి కేశన్న మంగళవారం సాయంత్రం అనంతపురంలోని పాతూరు జంగాలపల్లి మసీదు వద్ద ఉన్న సమయంలో మేనత్త కుమారుడు సుబ్బారావు కలసి మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే రోజూ తాగుడుకు డబ్బు కావాలంటూ దౌర్జన్యం చేయడం సరికాదని కేశన్న సర్దిచెప్పబోతుండగా కొడవలితో దాడికి తెగబడ్డాడు. స్థానికులు కేకలు వేయడంతో సుబ్బారావు అక్కడి నుంచి పారిపోయాడు. క్షతగాత్రుడు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇద్దరూ టీడీపీకి చెందిన వారే కావడం, పైగా సమీప బంధువులు కావడంతో దాడిని రాజీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మృతురాలు మంజుల

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామంలో మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై వితంతువు మంజుల(49) మృతి చెందింది. పండుగ పూట ఇంటిని నీటితో శుభ్రం చేస్తుండగా స్విచ్ బోర్డులోకి నీరు చేరింది. విషయాన్ని గుర్తించని మంజుల నీడ కోసం ఏర్పాటు చేసిన ఇనుప పైపును పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనాస్థలాన్ని స్థానిక విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు.

'స్పీడ్' పెంచిన 'తపాలా'

- నేటి నుంచి స్పీడ్ పోస్టులోకి రిజిస్టర్ పోస్టు విలీనం
- తడిసి మోపెడవుతున్న చార్జీలు



అనంతపురం సిటీ: రిజిస్టర్ పోస్టును రద్దు చేసి, స్పీడ్ పోస్టులో కలిపేస్తున్నట్లు ప్రకటించిన తపాలా శాఖ.. స్పీడ్ పోస్టు చార్జీలను భారీగా పెంచింది. పెరిగిన కొత్త ధరలు అక్టోబర్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో వినియోగదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కాకుండా ఉండేందుకు ఈ–కామర్స్ తరహాలో ఓటీపీ ఆధారిత డెలివరీ వంటి సేవలు, దేశ వ్యాప్తంగా ఒకే టారిఫ్, విద్యార్థులకు 10 శాతం రాయితీ అంటూ నమ్మబలికే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది.

నేటి నుంచే స్పీడ్ పోస్టు అమలు : అతి తక్కువ ఖర్చుతో అనువైన తపాలా సేవగా కొనసాగుతూ వచ్చిన రిజిస్టర్ పోస్టును తపాలా శాఖ పూర్తిగా రద్దు చేస్తూ స్పీడ్ పోస్టులోకి విలీనం చేసింది. తపాలా శాఖ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల వారిపై అదనపు భారం పడుతోంది. అంతేకాక పోస్టు డెలివరీ సమయంలో చిరునామాదారు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ధ్రువీకరణ తరువాతే పోస్టుమాన్ ఆ పోస్టును అందజేస్తారు. ఈ సేవ కోసం నిర్దేశిత టారిఫ్ మీద జీఎస్టీ కాకుండా అదనంగా ఒక్కో ఆర్టికల్‌కు రూ.5 చొప్పున వసూలు చేస్తారు. బల్క్ సేవలు వినియోగించుకునే సంస్థలకు 5 శాతం తగ్గింపు ప్రకటించింది. అయితే తపాలా శాఖ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకే..



కేంద్ర తపాలా శాఖ తీసుకుంటున్న నిర్ణయాలు కార్పొరేట్ కొరియర్ సంస్థలకు మేలు చేకూర్చేలా ఉన్నాయి. దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టులోకి విలీనం చేయడం వినియోగదారుల నడ్డి విరిచే నిర్ణయం తీసుకుంది.

– ఇనగలూరు ఇమ్రోజా, నిరుద్యోగి, అనంతపురం

ధరలు పెంచి రాయితీనా?




అందరికీ అనువైన ధరలతో ఉన్న రిజిస్టర్ పోస్టును రద్దు చేసిన స్పీడ్ పోస్టులో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే స్పీడ్ పోస్టు ధరలు విపరీతంగా ఉన్నాయి. పైగా విద్యార్థులకు మాత్రం పది శాతం రాయితీ ఇస్తున్నట్లు గొప్పలకు పోయారు. ధరలు ఇష్టానుసారంగా పెంచి తగ్గిస్తున్నట్లు బుకాయించడం దేనికో?

– బోయ ఎస్.పల్లవి, ఉద్యోగిని, అనంతపురం

అరటి చెట్టుకు రెండు గెలలు

పుట్లూరు: సాధారణంగా అరటి చెట్టుకు ఒక గెల మాత్రమే వస్తుంది. అయితే ఇందుకు భిన్నంగా పుట్లూరు మండలం రంగరాజుకుంట గ్రామానికి చెందిన రైతు పొన్నపాటి హనుమంతురెడ్డి తోటలో ఒక చెట్టుకు రెండు గెలలు వచ్చాయి. నాలుగు ఎకరాల్లో అరటి పంటను సాగు చేయగా రెండవ పంటలో ఇలా ఒక చెట్టుకు మాత్రమే రెండు గెలలు వచ్చిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇలా రెండు గెలలు రావడం ఎన్నడూ చూడలేదని స్థానిక రైతులు చెబుతున్నారు. కాగా, అరటి మొక్క కాండంలో రెండవ శిరోజం ఏర్పడినప్పుడు ఇలా రెండు గెలలు వస్తాయని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



విధుల నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ తొలగింపు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గొల్ల రామాంజనేయులును విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్ గడిపూటి అనిల్‌కు నోటీసులు జారీ చేసినట్లు రాయదుర్గం విద్యుత్ శాఖ ఏడీఏ శ్రీనివాసనాయుడు మంగళవారం రాత్రి వెల్లడించారు. ఆదివారం బొమ్మనహాళ్ గ్రేడ్–2 జూనియర్ లైన్‌మెన్ కురుబ రామాంజనేయులు ఓ రైతు పొలంలో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై విచారణ చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులు... షిఫ్ట్ ఆపరేటర్ గొల్ల రామాంజనేయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎల్‌సీ రిటర్న్ సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించి లైన్‌మెన్ రామాంజనేయులు మృతికి కారకుడైనట్లుగా నిర్ధారించారు. దీంతో ఆపరేటర్ గొల్ల రామాంజనేయులను విధుల నుంచి తొలగిస్తూ కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేశారు.

జై జవాన్.. జై కిసాన్!

- తాడిపత్రి ఖ్యాతిని ఖండాంతరాలకు చేర్చిన విద్యార్థినులు
- అరుదైన అవకాశాలతో విదేశాల్లో శిక్షణ

తాడిపత్రి టౌన్: అరుదైన అవకాశాలతో తాడిపత్రి ఖ్యాతిని ఇద్దరు విద్యార్థినులు ఖండాంతరాలు దాటించారు. ఓ విద్యార్థిని దక్షిణాఫ్రికాలో పైలెట్ శిక్షణ తీసుకుంటుండగా.. మరో విద్యార్థిని రూ.70 లక్షల ఉపకార వేతనంతో జపాన్ దేశంలోఉచిత సీటు సాధించి వ్యవసాయంపై పరిశోధనలు చేస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఒకరు జై కిసాన్ అంటుండగా.. మరొకరు జై జవాన్ నినాదంతో తమ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారు.

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం..



జపాన్‌లోని హోక్కాయిదో వర్సిటీలోని అగ్రి ల్యాబ్‌లో పరిశోధనలు నిర్వహిస్తున్న భానురేఖ

తాడిపత్రిలోని అంబాభవానీ వీధిలో నివాసముంటున్న వద్దిమోహన్ కుమార్తె భానురేఖ.. వ్యవసాయంపై మక్కువతో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా చదువులో ప్రతిభ కనబరుస్తూ ఇక్రిశాట్‌లో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు అర్హత సాధించింది. అనంతరం ఎమ్మెస్సీ చదివేందుకు జపాన్‌లోని మెక్స్ సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షల్లో నెగ్గి ఆ దేశంలోని హోక్కాయిడో యూనివర్సిటీలో రూ.70 లక్షల ఉపకార వేతనంతో ఉచితంగా సీటు దక్కించుకుంది. వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగి ఆధునిక వ్యవసాయంపై పరిశోధనలు చేసి, వాటి ఫలాలను రైతులకు చేరువ చేస్తానని భానురేఖ సగర్వంగా అంటున్నారు.

తండ్రి స్ఫూర్తితో...



పైలెట్ శిక్షణకు ఎంపికైనట్లుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సాయిహరితారెడ్డి

తాడిపత్రిలోని రెడ్డివారిపాలెంలో నివాసముంటున్న మనోహర్‌రెడ్డి భారత సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్ఫూర్తితో భారత సైన్యంలో చేరాలని కుమార్తె సాయిహరితరెడ్డి పరితపిస్తూ వస్తోంది. ఈ క్రమంలో బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వెంటనే ఐసీఐసీఐ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. అయినా రాజీ పడకుండా ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ తొలిసారిగా అమ్మాయిలకు పైలెట్ శిక్షణ కోసం చేపట్టిన ఇంటర్వ్యూలకు హాజరైంది. ఇంటర్వ్యూలో ప్రతిభ చాటి పైలెట్ శిక్షణకు అర్హత సాధించిన సాయిహరిత రెడ్డిని అభినందిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని వ్యోమగామి కల్పనాచావ్లా తల్లి అందజేశారు. ప్రస్తుతం సాయి హరితారెడ్డి దక్షిణాఫ్రికాలో పైలెట్ శిక్షణ తీసుకుంటోంది. తన తండ్రిలా సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనేదే లక్ష్యమని ఆమె చెబుతోంది.

క్లుప్తంగా

తపోవనం జట్టు ఘన విజయం


7 వికెట్లు సాధించిన ధనుష్

అనంతపురం: అండర్–15 ఇన్విటేషన్ టోర్నీలో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తపోవనం జట్టు ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన తపోవనం జట్టు 146 పరుగులు సాధించింది. కుశ్వంత్ సాయి 58 పరుగులు సాధించి సత్తా చాటాడు. లక్ష్య ఛేదనలో ఎంవైసీఏ అనంతపురం జట్టు కేవలం 26 పరుగులకే కుప్పకూలింది. తపోవనం జట్టులో ఆఫ్ స్పిన్నర్ ధనుష్ 4 ఓవర్లకు 8 పరుగులు ఇచ్చి 7 వికెట్లు సాధించాడు. టీ–20 టోర్నీలో రికార్డు సృష్టించాడు. ధనుష్‌ను కోచ్‌లు శివ, తాహిర్, క్రాంతి, భాను , కరుణాకర్ అభినందించారు.

ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ధన్వంతరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల, సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని కులాలకు చెందిన వారి కులపెద్దల జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వము నిర్వహిస్తోందని తెలిపారు. నాయీ బ్రాహ్మణ కుల పెద్ద అయిన ధన్వంతరి జయంతిని కూడా అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆయుధపూజ


ఆయుధ పూజ చేస్తున్న రిజిస్ట్రార్ రమేష్ బాబు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. క్యాంపస్‌లోని విద్యుత్ ఆఫీసు, పంప్ హౌస్, వర్సిటీ వాహనాలకు రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఆయుధ పూజ నిర్వహించి.. దుర్గామాత ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఈ ఉమాపతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్, ఇంజినీర్లు, ఆపరేటర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రామగిరివాసికి డాక్టరేట్

రామగిరి: మండలంలోని పెనుబోలుకు చెందిన బాలకొండ గంగాధర్ చరిత్రశాఖలో పీహెచ్‌డీ పట్టాను సోమవారం తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవవర్మ చేతులమీదుగా అందుకున్నారు. గంగాధర్ వైఎస్సార్ జిల్లా వేంపల్లె డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, వరాహగిరి వెంకటగిరి, నీలం సంజీవరెడ్డిపై విమర్శనాత్మక విశ్లేషణపై ఆచార్య సుధారాణి పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తిచేశారు. ఇందుకు ఆయన డాక్టరేట్ అందుకున్నారు.

చంద్రప్రభలతో ఏడుకొండలవాడి దర్శనం


చంద్రప్రభ వాహనంపై వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని కల్గిస్తున్నాయి. ఏడుకొండలవాడు మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు నయనానందకరం చేశారు. ఆర్‌ఎఫ్ రోడ్డు, హౌసింగుబోర్డు, శ్రీనివాసనగర్ తదితర చోట్ల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లక్ష్మీ వేంకటేశ్వస్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్టుకు చందన సమేత అభిషేకాలు, అలంకార సేవలతో పాటూ దీక్షా హోమాన్ని అర్చకులు హరికిశోర్ శర్మ భక్తిశ్రద్ధలతో జరిపించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో రైల్వేఫీడర్ రోడ్డు వేంకటేశ్వరాలయం సందడిగా మారింది. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

అనంతపురం : స్థల ఆక్రమణపై మంగళవారం బాధితులు జిల్లా ఎస్పీ పి.జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు సీఎస్ రజియా, సీఎస్ దాదా ఖలందర్ వివరాల మేరకు.. అశోక్‌నగర్‌కు చెందిన సీఎస్ ఫక్రుద్దీన్, సీఎస్ మస్తాన్‌బీకి నలుగురు కుమారులున్నారు. వీరికి అశోక్‌నగర్‌లో 5.64 సెంట్ల స్థలం ఉంది. అయితే మస్తాన్‌బీ తెలియకుండా వారి కుమారుల్లో ముగ్గురు స్థలాన్ని తమ పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారి సోదరుడి సంతానమైన సీఎస్ రజియా, సీఎస్ దాదాఖలందర్ 2021లో కోర్టును ఆశ్రయించగా ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చింది. తర్వాత ముగ్గురూ కోర్టులో ఉందని తెలిసినా 1.88 సెంట్ల స్థలాన్ని రాయచూరు బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తికి అమ్మారు. అయితే తాము ఊరిలో లేరని తెలుసుకుని ఇంటిని తొలగించి కొత్తగా నిర్మాణం చేపట్టాలని చూస్తున్నారని, కోర్టు తుది తీర్పు వచ్చే వరకూ ఎలాంటి క్రయ, విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు ఎస్పీకి విన్నవించారు.

సంప్రదాయానికి పట్టం.. విజ్ఞాన వైభవం


బొమ్మల కొలువు చూపిస్తున్న డాక్టర్ శాంత దంపతులు


శ్రీరామపట్టాభిషేక దృశ్యం


కుంభకర్ణుడిని నిద్రలేపుతున్న రాక్షసులు

అనంతపురం కల్చరల్: కంప్యూటర్ ఆటలే లోకంగా మారిపోయిన ఈ రోజుల్లో చాలా మందికి పండుగల ప్రాశస్త్యం తెలియకుండా పోతోంది. పూర్వం బొమ్మల ద్వారానే విజ్ఞాన విషయాలను, పురాణేతిహాసాల విశేషాలను అందించేవారు. ఈ నేపథ్యంలో దసరా వచ్చిందంటే తొమ్మిది రోజుల పాటు బొమ్మల కొలువు తీర్చి వాటి విశేషాలపై భావితరాన్ని చైతన్యపరిచేవారు. ఈ సంప్రదానికి పట్టం కడుతూ నేటికీ అనంతపురంలోని రెండోరోడ్డు జ్ఞానపీఠం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, తపోవనం వేదమాత గాయత్రి ఆలయంతో పాటు పలువురు తమ ఇళ్లలో బొమ్మల కొలువులతో ఆకట్టుకుంటున్నారు. అలాగే ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శాంత శ్రీనివాసరావు దంపతులు నాలుగు దశాబ్దాలకు పైగా కోర్టు రోడ్డులోని తమ ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి, వాటి ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. ఏటా ఓ కొత్త పురాణ గాథతో బొమ్మల కొలువు నిర్వహిస్తున్నారు.


తపోవనం వేదమాత ఆలయంలో..


రెండోరోడ్డు శ్రీమఠంలో బొమ్మలకొలువు

విదేశాల నుంచి కూడా సేకరించాం

ఏటా వేర్వేరు అంశాలతో కూడిన బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తుంటాం. ఆయా పురాణగాథలకు అనుగుణంగా అవసరమైన బొమ్మలను దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు చైనా, బ్యాంకాక్, మలేషియా, సౌత్ ఆఫ్రికా, అమెరికా నుంచి కూడా సేకరించాం. చిన్నారులకు విలువలతో కూడిన పురాణ గాథలను కళ్లకు కట్టినట్లు చూపడమే కాక, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ బొమ్మల కొలువు ఎంతో దోహద పడుతుంది.
– డాక్టర్ శాంత, గైనకాలజిస్టు, అనంతపురం

అక్రమ అరెస్టులకు భయపడొద్దు


సాయి భార్గవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


బండి కొండమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తోందని, అక్రమ అరెస్టులకు ఎవరూ భయపడొద్దని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. గత నెల 24న మండలంలోని హంపాపురానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త బాలగొండ సాయి భార్గవ్‌ను గుంటూరు సీఐడీ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయగా సీబీసీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గురువారం హంపాపురం వెళ్లి సాయి భార్గవ్‌ను పరామర్శించారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ బాలగొండ సాయి భార్గవ్‌ను అరెస్ట్ చేయగానే.. విషయాన్ని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆయన ఆదేశాలతో కోర్టులో మన లాయర్లు వాదించడంతో బెయిల్ వచ్చిందన్నారు. భయపడొద్దని సాయి భార్గవ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మీకు ఏ సాయం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పసుపుల నరసింహులు కుటుంబాన్ని, ముట్టాల నారాయణ, జానగాని పక్కీరప్ప, రాజారెడ్డిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, బుడగ నాగరాజు, కపాడం ఆదినారయణ, గద్దే రామకృష్ణ రెడ్డి, గద్దే కేశవ రెడ్డి, తలారి సింగారప్ప, చుక్కా సంజీవ్ రాయుడు, చుక్కా వీరాంజనేయులు, జానగాని మల్లికార్జున, జానగాని సాంబ, పసుపుల రమణ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేయడం సమంజసం కాదు

ఆత్మకూరు: అధికారం ఉందన్న అహంకారంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ నేతలు దాడులు చేయడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. బ్రాహ్మణ యాలేరుకు చెందిన బండి కొండమ్మ, బండి చిన్నఅహోబిలంపై టీడీపీ నేతలు దాడి చేసిన విషయాన్ని ఆయన తప్పుపట్టారు.మంగవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కొండమ్మ, చిన్న అహోబిలం ఆయన పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.అనంతరం అహోబిలం కుమారుడు బండి నాగరాజుకు ధైర్యం చెప్పారు.

సెక్టోరియల్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం

అనంతపురం టవర్‌క్లాక్: సెక్టోరియల్ పోస్టుల్లో ఎస్సీ ఎస్టీలకు తీరని అన్యాయం జరిగిందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురం జిల్లాలో రెండు నెలల క్రితం ఎస్ఎస్ ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిసెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. పోస్టుల భర్తీలో అగ్ర కులాలవారికి పెద్దపీట వేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలను ఒక్క పోస్టు కూడా కేటాయించలేదని, ఏపీసీ శైలజ తన అనుకూలమైన వారికి పోస్టులు ఇచ్చారని ఆరోపించారు. జీఓ 07కు విరుద్ధంగా పోస్టులను భర్తీ చేశారన్నారు. దీనిపై డీఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష ఏపీసీపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాకే చిరంజీవి, బంగి ఓబులపతి, రామాంజనేయులు, బానాసి శీనా, బండారు చంద్ర, శివ శంకర్, వరప్రసాద్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న బోయ రామాంజనేయులు

రాప్తాడు: బీసీ కులాలకు జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాప్తాడులో స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సీపీఐ ఆధ్వర్యంలో జనగణనలో కుల గణన చేపట్టాలని, బీసీ కులాల జనాభా ప్రతిపాదికన తెలంగాణలో మాదిరిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా, కుల సంఘాల నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 143 వెనుకబడిన కులాలు ఉన్నాయని, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వల్ల వేల సంఖ్యలో బీసీలు పదవులు కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టి, అందుకు అనుగుణంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4న అనంతపురంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సదస్సుకు జిల్లాలోని బీసీలు, బీసీ సంఘాలు నాయకులు పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రాప్తాడు విద్యుత్ శాఖ ఏఈ సస్పెన్షన్

రాప్తాడు: పని ప్రాంతంలో విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన కేసులో రాప్తాడు మండల విద్యుత్ శాఖ ఏఈని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 20న రాప్తాడు మండలం హంపాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33కేవీ విద్యుత్ లైన్ పనులు జరిగాయి. అయితే సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలపడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్ బషీ అనే కార్మికుడు ఎస్‌వీఐటీ కళాశాల వెనుక వైపు 11 కేవీ పోల్ మీద ఎక్కి జంపర్‌కు కనెక్షన్‌కు ఇచ్చేందుకు ప్రయత్నించాడు. ఇంతలో విద్యుత్ సరఫరా కావడంతో స్తంభం మీద ఉన్న షేక్ బషీ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత నెల 26న మృతిచెందాడు. ఈ ఘటనను ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చిన అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ వారం రోజులుగా సీఐటీయూ నాయకులు ఆందోళనలు సాగిస్తూ వచ్చారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఎల్‌సీ ఇస్తున్నట్లు తెలిపిన మండల విద్యుత్ ఏఈ శివప్రసాద్‌నాయుడు... అనంతరం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వెల్లడైంది. దీంతో ఏఈ నిర్లక్ష్యం కారణంగానే ప్రైవేట్ కార్మికుడు మృతి చెందినట్లుగా నిర్ధారించుకున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్... ఏఈ శివప్రసాదనాయుడిని సస్పెండ్ చేస్తే ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జేఎల్ఎం పోతులయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకొనున్నట్లు వెల్లడించారు.

రోడ్డెక్కిన గోడ!

- రాత్రికి రాత్రే రోడ్డుపై గోడ నిర్మాణం
- ఇబ్బందుల్లో స్థానికులు


రోడ్డుకు అడ్డంగా నిర్మించిన కట్టడాలు

అనంతపురం రూరల్: ఎన్నో ఏళ్లుగా కాలనీలో ఉన్న రహదారిపై రాత్రికి రాత్రే గోడ కట్టేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీ ఏఎస్ఆర్ నగర్‌కు వెళ్లే మార్గంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రహదారిపై రాకపోకలు సాగించకుండా స్థానికంగా నివాసం ఉంటున్న ఓ మహిళ గోడ నిర్మించడం ప్రస్తుతం వివాదాస్పదమైంది. 2019లో సదరు ఇంటిని తాను కొనుగోలు చేశానని, ఇంటి పక్కనే ఉన్న రోడ్డు సైతం తనకే చెందుతుందని, రోడ్డు స్థలాన్ని వదలాలంటే తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించాలని పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఉన్నతాదికారులు దృష్టికి తీసుకెళ్లి విచారణ చేస్తామని పంచాయతీ కార్యదర్శి చెప్పినా ఆమె వినకుండా సోమవారం రాత్రికి రాత్రే రోడ్డుపై గోడ నిర్మించేసింది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలంటూ ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.


చిన్మయనగర్‌లో పూజలందుకుంటున్న దుర్గాదేవి


పాతూరు అమ్మవారిశాలలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత


వడ్డుపల్లిలో దుర్గామాతగా సుంకులమ్మ అమ్మవారు


పసుపుకొమ్ముల అలంకరణలో ఉమానగర్ రేణుకాయల్లమ్మ

జయహో దుర్గా భవాని


కొత్తూరు అమ్మవారి శాల అధ్వర్యంలో అమ్మవారి తోటోత్సవం


ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో కీలక ఘట్టమైన దుర్గాష్టమి రాకతో అమ్మవారి ఆలయాలు లలితా సహస్ర నామాలతో పులకించిపోయాయి. కొత్తూరు అమ్మవారి శాల అధ్యక్షుడు మచ్చానరసింహులు నేతృత్వంలో తోటోత్సవం కనులపండువగా సాగింది. ప్రకృతిమాతగా ఆలయాన్ని అలంకరించారు. అద్దాల అలంకారంలో దర్శనమిచ్చిన పాతూరు వాసవీమాత ఆలయ పరిసరాలు అమ్మవారి కటాక్షం కోసం వచ్చే భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. శంకరమఠంలో రాజరాజేశ్వరీ అలంకారం, ఉమానగర్‌లో రేణుగా యల్లమ్మ పసుపుకొమ్ముల అలంకారం, కొల్హాపూర్ మహాలక్ష్మి దుర్గాదేవిగా, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. శ్రీపీఠంలో చండీహోమాలను జరిపించడానికి చెన్నై నుంచి ఆధ్యాత్మికవేత్త గోటేటి శ్రీనివాసరావు విచ్చేసి పీఠం వ్యవస్థాపకులు మధుసూధనరావుతో కలిసి పూర్ణాహుతి నిర్వహించారు. రెండోరోడ్డులో అపరదుర్గామాతగా అవతరించిన లలితా అమ్మవారికి పెద్ద ఎత్తున దీపకాంతులను అమర్చి ఆరాధించారు. శివబాలయోగి ఆశ్రమంలో హోమాలు జరిగాయి. మంజునాథ్, పద్మజ అనే భక్తులు అమ్మవారికి 150 గ్రాములు పుష్పాహార ఆభరణాలనందించారు.


కొత్తూరు అమ్మవారిశాలలో వాసవీమాత


నసనకోటలో దుర్గాదేవి అమ్మవారు

కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలో కొలువుదీరిన నసనకోట ముత్యాలమ్మను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా వస్తున్న కార్మికులకు దుస్తుల పంపిణీ అనంత వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా సాగింది. ఆలయ వ్యవస్థాపకులు కార్పొరేటర్ గురుశేఖరబాబు, మాజీ కార్పొరేటర్ బిందుప్రియ చేస్తున్న నిరంతర సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, బూత్ కమిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు అమరనాథరెడ్డి, క్రిష్టియన్ విభాగం రాష్ట్ర కార్యదర్శి జానీ, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు ఆసీఫ్, పాటిల్ తిమ్మారెడ్డి, రఘునాథగౌడ్, శేఖర్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి సుప్రీంకోర్టు జర్నైల్ సింగ్–2కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ చేశారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఓసీ, బీసీ ఉద్యోగ సంఘాల డిమాండ్ సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా ఉన్నందున వాటిని పరిగణించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

అద్వైతంతోనే విశ్వవ్యాప్తంగా జ్ఞానరేఖలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆత్మవిదానంద సరస్వతీ స్వామీజీ

అనంతపురం కల్చరల్: అద్వైతంతోనే భారతీయ జ్ఞానరేఖలు విశ్వవ్యాప్తమయ్యాయని చిన్మయా మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతీ అన్నారు. సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ రచించిన ‘శ్రీఆదిశంకర భగవత్పాదులు–జీవితము, సాహిత్యం’ పుస్తకాన్ని మంగళవారం తపోవనంలోని చిన్మయా జగదీశ్వరాలయ ప్రాంగణంలో స్వామీజీ, ఇతర ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ డాక్టర్ రమేష్ నారాయణ కలం నుంచి జాలువారిన శంకరభగవత్పాదుల జీవితం సమసమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. నిజమైన కమ్యూనిజాన్ని ఆది శంకరులు 13వ శతాబ్దంలో వెలుగులోకి తెచ్చారని విశ్వంలో ఏదీ ఎక్కువ తక్కువలు లేని తత్వంగా ప్రచారం చేసి సమానత్వాన్ని ప్రతిపాదించారన్నారు. ఆయన చిన్నవయసులో చేసిన మహత్కార్యాల భావవ్యాప్తికి చిన్మయా మిషన్ మరింత విస్తృత ప్రచారం గావించిందని గుర్తు చేశారు. దేశంలో కీలకమైన శృంగేరీ, బదిరి, పూరి, ద్వారక వంటి చతురామ్నాయ పీఠాలను స్థాపించి అద్వైతాన్ని ఘనంగా చాటారన్నారు. రచయిత డాక్టర్ రమేష్‌నారాయణ మాట్లాడుతూ కుల మతాలన్నీ సమానమేనన్న శంకరుల భావన నేటి పరిస్థితులకు అత్యంత అవసరమని గ్రంథాన్ని వ్యవప్రయాసలకోర్చి అందరికి ఉచితంగా అందిస్తున్నామన్నారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ప్రాంగణంలోని శంకర మఠానికి నూతన ఆలయ చైర్మన్‌గా ఎంపికైన నరేంద్రచౌదరి ద్వారా భక్తులక్విడానికి పుస్తకాలనందించారు. కార్యక్రమంలో గణేశ్ శర్మ, సావిత్రి, జ్యోతి, శివాలయం డైరెక్టర్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.




రన్నరప్ బోపన్న-యుజికి జోడీ

కెరీర్‌లో 27వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. టోక్యోలో మంగళవారం ముగిసిన జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-టకెరు యుజికి (జపాన్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. హ్యూగో నిస్ (మొనాకో)-ఎడువార్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటతో జరిగిన డబుల్స్ ఫైనల్లో బోపన్న-యుజికి ద్వయం 5-7, 5-7తో పోరాడి ఓడిపోయింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-యుజికి ఆరు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌లను ఒకసారి బ్రేక్ చేశారు. రన్నరప్ బోపన్న-యుజికి జంటకు 72,940 డాలర్ల (రూ. 64 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 300 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. విజేతగా నిలిచిన హ్యూగో నిస్-వాసెలిన్ ఖాతాలో 1,36,760 డాలర్ల (రూ. 1 కోటీ 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి. 45 ఏళ్ల బోపన్న తన డబుల్స్ కెరీర్‌లో 64 టోర్నీల్లో ఫైనల్‌కు చేరాడు. 26 టోర్నీల్లో విజేతగా, 38 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ప్రదానం చేయలేదని.. ఎప్పటికీ పంపరా?

ఏసీసీ చీఫ్ నఖ్వీ ట్రోఫీ డ్రామాపై బీసీసీఐ ఆక్షేపణ ● ఏజీఎంలో తీవ్రస్థాయిలో అభ్యంతరం



రాజీవ్ శుక్లా



నఖ్వీ

దుబాయ్: ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షుడి వ్యవహార శైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మండిపడింది. మంగళవారం ఇక్కడ ఏసీసీ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఇందులో భారత బోర్డు తరఫున సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశిష్ షెలార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు కూడా అయిన ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ విపరీత ధోరణిపై బీసీసీఐ ప్రతినిధులిద్దరు ఆక్షేపించారు. నఖ్వీ పాక్ ప్రభుత్వంలో మంత్రి కూడా కావడంతో టీమిండియా అతని చేతుల మీదుగా జరగాల్సిన ట్రోఫీ ప్రదానోత్సవాన్ని సున్నితంగా తిరస్కరించింది. ఆదివారం రాత్రి తను ప్రదానం చేయలేదన్న అక్కసుతో నఖ్వీ తర్వాత కూడా విజేత భారత జట్టుకు పంపకుండా ఏసీసీ కార్యాలయంలోనే అట్టిపెట్టాడు. దీంతో 'కప్' లేకుండానే భారత క్రికెట్ జట్టు సభ్యులు స్వదేశానికి వచ్చారు. మంగళవారం జరిగిన ఏజీఎంలో నఖ్వీ కొనసాగిస్తున్న 'ట్రోఫీ డ్రామా'పై శుక్లా, షెలార్ తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది ఏసీసీ ట్రోఫీ. ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. వ్యక్తిగతంగా ఎవరికి చెందదు. టోర్నీలో గెలిచిన విజేత జట్టుకే అప్పగించాలి' అని రాజీవ్ శుక్లా గట్టిగానే స్పష్టం చేశారని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఏజీఎంలో ఇంత జరుగుతున్నా... భారత్ నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వెల్లువెత్తుతున్నా... ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ మాత్రం ఇంకా తన మొండి పట్టు వీడటం లేదు. ట్రోఫీని ఇచ్చేందుకు సమావేశంలో అంగీకరించలేదని తెలిసింది. ట్రోఫీ గురించి ఏజీఎంలో చర్చించాల్సిన అవసరం లేదని, మరో సమావేశంలో మాట్లాడుకుందామని నఖ్వీ దాటవేశారు. ఏసీసీ ఎజెండాలోని వైస్ చైర్మన్ ఎన్నిక వరకే ఈ మీటింగ్‌ను పరిమితం చేయాలని చూశారు. అంతేకాదు. వెస్టిండీస్‌పై నేపాల్ సంచలన విజయం పట్ల నేపాల్ జట్టును అభినందించారు. నేపాల్ ఆసియా జట్టు కావొచ్చు. కానీ ఆ ద్వైపాక్షిక సిరీస్ ఏసీసీకి సంబంధించిన టోర్నీ కానేకాదు. అయినా నేపాల్‌ను ప్రశంసించిన నఖ్వీ... ఏసీసీ సొంత టోర్నీ అయిన ఆసియా కప్ గెలిచిన భారత్‌ను మాటమాత్రంగానైనా అభినందించకుండా తన కుటిల బుద్ధిని చాటుకున్నారు. మొత్తానికి ఆసియా కప్ ట్రోఫీ మాత్రం ఇంకా ఏసీసీ కార్యాలయంలోనే ఉంది.

జాతీయ క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలను గౌరవించేందుకు ఉద్దేశించిన జాతీయ క్రీడా పురస్కారాలు-2025 కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏటా ఇచ్చే ఈ అవార్డుల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు అక్టోబర్ 28వ తేదీ. క్రీడారంగంలో వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు, అర్జున అవార్డు, అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం), ద్రోణాచార్య అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ (ఆర్‌కేపీపీ) పురస్కారాలను అందజేస్తారు. క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. అవార్డుల మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.dbtyas-sports.gov.in ను చూడాలని కోరింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత మహిళల శుభారంభం
- శ్రీలంకపై 59 పరుగులతో జయభేరి
- రాణించిన హర్లీన్, అమన్‌జోత్
- ఈనెల 5న పాకిస్తాన్‌తో టీమిండియా పోరు
- మహిళల వన్డే ప్రపంచకప్

గువాహటి: సొంతగడ్డపై అట్టహాసంగా ఆరంభమైన వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లో కీలక వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. దీంతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్... వర్షం వల్ల కుదించిన 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (53 బంతుల్లో 53; 3 ఫోర్లు), అమన్‌జోత్ కౌర్ (56 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), రాణించారు. లంక బౌలర్లలో ఇనోక రణవీర 4 వికెట్లు, ప్రబోధని 2 వికెట్లు తీశారు. అనంతరం దిగిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (47 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడింది. దీప్తి (3/54) సహా భారత బౌలర్లు స్నేహ్ రాణా (2/32), ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి (2/37), క్రాంతి (1/41), అమన్‌జోత్ (1/37), ప్రతిక (1/6) సమష్టిగా ప్రత్యర్థి బ్యాటర్ల భరతం పట్టారు.



అమన్‌జోత్‌తో నడిపించి... బౌలింగ్‌తో గెలిపించి...

భారత వెటరన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోకు శ్రీలంక కుదేలైంది. ప్రతీక (37; 3 ఫోర్లు, 1 సిక్స్), హర్లీన్ డియోల్ (64 బంతుల్లో 48; 6 ఫోర్లు) **మెరుగ్గా ఆడినప్పటికీ మరోవైపు కీలక స్టార్లు స్మృతి మంధాన (8), హర్మన్‌ప్రీత్ (21), జెమీమా (0), రిచా ఘోష్ (2) విఫలమవడంతో 124/6 స్కోరు** వద్ద భారత్ పనైపోయిందనిపించింది. ఈ దశలో దీప్తి, అమన్‌జోత్‌తో కలిసి భారత్‌ను నడిపించింది. లంక అమ్మాయిల చెత్త ఫీల్డింగ్‌తో అమన్‌జోత్ మూడుసార్లు 18, 37, 50 పరుగుల వ్యక్తిగత స్కోర్ల వద్ద అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడింది. ఇద్దరు అర్ధసెంచరీ పూర్తి చేసుకొని జట్టును ఒడ్డుకు చేర్చారు. ఏడో వికెట్‌కు 99 బంతుల్లో 103 పరుగులు జోడించాక ముందుగా అమన్‌జోత్, అనంతరం దీప్తి అవుటయ్యారు. ఆఖర్లో స్నేహ్ రాణా (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించింది. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది. ఓపెనర్, కెప్టెన్ చమరి ఆటపట్టు, వన్‌డౌన్ బ్యాటర్ హర్షిత (29; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో నీలాక్షిక సిల్వా (29 బంతుల్లో 35; 4 ఫోర్లు; 1 సిక్స్) మెరుగ్గా ఆడారంతే! మిగతా బ్యాటర్లను భారత బౌలింగ్ దళం క్రీజులో నిలువనీయలేదు.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ఇండోర్
మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (సి) **విష్మి (బి) ఇనోక** 37; స్మృతి మంధాన (సి) విష్మి **(బి) ప్రబోధని** 8; హర్లీన్ డియోల్ (సి) దిల్హారి **(బి) ఇనోక 48;** హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని **(బి) ఇనోక 21**; జెమీమా రోడ్రిగ్స్ (బి) ఇనోక **0; దీప్తి శర్మ** (సి) సుగంధిక (బి) అచిని 53; **రిచా ఘోష్** (సి) ప్రబోధని (బి) చమరి 2; **అమన్‌జోత్** (సి) విష్మి (బి) ప్రబోధని 57; **స్నేహ్ రాణా** (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (47 ఓవర్లలో 8 వికెట్లకు) 269. వికెట్ల పతనం: 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269.

బౌలింగ్: అచిని కులసూర్య 8-0-42-1, ఉదేషిక ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, కవిశా దిల్హారి 8-0-51-0, ఇనోక రణవీర 9-0-46-4, చమరి 3-0-24-1.

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని (బి) క్రాంతి గౌడ్ 14; చమరి (బి) దీప్తి శర్మ 43; హర్షిత (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీచరణి 29; విష్మి గుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) అమన్‌జోత్ 11; కవిశా (సి) రిచా ఘోష్ (బి) దీప్తి 15; నీలాక్షిక (బి) స్నేహ్ రాణా 35; అనుష్క (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 6; సుగంధిక (బి) స్నేహ్ రాణా 10; అచిని (సి) స్మృతి (బి) శ్రీచరణి 17; ప్రబోధని (నాటౌట్) 14; ఇనోక రణవీర (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రతిక రావల్ 3; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (45.4 ఓవర్లలో ఆలౌట్) 211. వికెట్ల పతనం: 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211.

బౌలింగ్: క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక 2.4-0-6-1.

తిలక్ వర్మకు సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో తిలక్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశాడు. పాకిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ అజేయ అర్ధ సెంచరీ సాధించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ సందర్భంగా తిలక్ వర్మ సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను, జెర్సీని అందజేశాడు. తిలక్ ఇచ్చిన బ్యాట్‌తో రేవంత్ రెడ్డి క్రికెట్ షాట్ కొడుతున్న ఫోజు పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి, 'శాట్స్' ఎండీ సోనీ బాలాదేవి, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశలు వమ్ము చేయకూడదని...

శేరిలింగంపల్లి: పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఎంతో ఒత్తిడి ఉన్నా... ప్రత్యర్థి ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టినా... ఎక్కడా సంయమనం కోల్పోలేదని... వారికి తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చానని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. చిన్ననాటి నుంచి తాను ప్రాక్టీస్ చేసిన శేరిలింగంపల్లిలోని లేగలా క్రికెట్ అకాడమీకి మంగళవారం తిలక్ వచ్చాడు. ఈ సందర్భంగా తన కోచ్ సలామ్ బాయష్, అకాడమీ ఎండీ పృథ్వీ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'కోట్లాది మంది భారతీయుల ఆశలను వమ్ము చేయకూడదనుకున్నాను. చివర్లో ఒత్తిడి వచ్చినా... దేశం కోసం ఆడాలి, గెలిపించాలన్న లక్ష్యంతో ఓపికగా ఆడాను. హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎంతో ప్రోత్సహించారు. నేనీ స్థాయికి చేరుకోవడం వెనుక కోచ్ సలామ్, పృథ్వీ పాత్ర ఎంతో ఉంది. ఈ ఇద్దరినీ ఎప్పటికి మర్చిపోలేను. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలి. ఈ విషయంలో కోహ్లి, రోహిత్ శర్మలు ఆదర్శం' అని తిలక్ తెలిపాడు.

సాక్షి సినిమా



● సమంత

జ్ఞాపకాలను మోయడం ఆపేశాను

''నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను'' అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరిగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేశారు సమంత. ''ముప్పైఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది. మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్పై ఏళ్లలో ఉన్నాను. ప్రతి దాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.


కెమెరా కాలింగ్



● మమ్ముట్టి

మలయాళ స్టార్ మమ్ముట్టి కొంత గ్యాప్ తర్వాత తిరిగి సినిమా సెట్స్‌లోకి అడుగు పెడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో మమ్ముట్టి తీవ్ర అస్వస్థతకు గురయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. కానీ మమ్ముట్టి ఆరోగ్య సమస్య స్వల్పమైనదేనని, ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని దర్శకుడు మహేశ్ నారాయణన్ పేర్కొన్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారులుగా ఫాహద్ ఫాజిల్, కుంచాకో బోబన్ కీలక పాత్రల్లో నటిస్తున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మమ్ముట్టి అస్వస్థతకు గురయ్యారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ''జీవితంలో నాకు ఎంతో ఇష్టమైన పనిని (సినిమా షూటింగ్‌ని ఉద్దేశించి) తిరిగి ప్రారంభిస్తున్నాను. నా ఆబ్సెన్స్‌లో నా గురించి తెలుసుకోవాలనుకున్న అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి మాటలు సరిపోవు. ది కెమెరా ఈజ్ కాలింగ్'' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు మమ్ముట్టి. అలాగే ఈ విషయంపై మహేశ్ నారాయణన్ మాట్లాడుతూ- ''మమ్ముట్టిగారు తిరిగి సినిమా సెట్స్‌లోకి వస్తున్నందుకు థ్రిల్లింగ్‌గా ఉంది. రాబోయే షూటింగ్ షెడ్యూల్‌లో మమ్ముట్టి, మోహన్‌లాల్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ఇన్ని రోజులు మమ్ముట్టిగారు సెట్స్‌కు రాకపోవడం వల్ల నష్టం వాటిల్లకుండా ఆయన లేని సీన్స్ చిత్రీకరించాం'' అని పేర్కొన్నారు.

నవంబరులో కొదమసింహం



● చిరంజీవి

చిరంజీవి కెరీర్‌లోని సూపర్ హిట్ చిత్రాల్లో 'కొదమసింహం' ఒకటి. కె. మురళీ మోహనరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాధ, సోనమ్, వాణీ విశ్వనాథ్ హీరోయిన్లుగా, మోహన్‌బాబు విలన్ పాత్ర పోషించారు. కె. నాగేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం 1990 ఆగస్టు 9న విడుదలై, ఘన విజయాన్ని సాధించింది. ముప్పైఐదేళ్ల తర్వాత ఈ సినిమాని నవంబరు 21న రీ రిలీజ్ చేయనున్నట్లు రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు తెలిపారు. ''చిరంజీవి కౌబాయ్‌గా నటించి, ప్రేక్షకుల్ని అలరించిన చిత్రం 'కొదమసింహం'. రాజ్-కోటి సంగీతం, మోహన్‌బాబు వినోదం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా నవంబరు 21న రీ రిలీజ్ చేయబోతున్నాం'' అని కైకాల నాగేశ్వర రావు చెప్పారు.

అసురుల గురువు శుక్రాచార్యుడు



● అక్షయ్ ఖన్నా

'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందిన తొలి చిత్రం 'హనుమాన్' (2024) పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ యూనివర్స్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అసురుల గురువు శుక్రాచార్యుడి పాత్రను బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పోషిస్తున్నారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఛావా' వంటి సూపర్ హిట్ మూవీలో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు అక్షయ్ ఖన్నా. తెలుగులో ఆయనకి 'మహాకాళి' తొలి చిత్రం. దేవతలు-దానవులు... ఇద్దరి భవితవ్యాన్ని మలిచిన శుక్రాచార్యుడిగా అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారు అక్షయ్. 'మహాకాళి' షూటింగ్ 50 శాతం పూర్తయింది. డిసెంబరుకి మొత్తం పూర్తవుతుంది. ఇతర నటీనటులు, సినిమా విడుదల తేదీ వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.



● దీపికా పదుకోన్

యాక్షన్... థ్రిల్



● విష్ణు విశాల్

విష్ణు విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ స్టూడియోస్‌పై శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. ''ఒక యునిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆర్యన్'. 'రాట్ససన్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. మా మూవీ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌లోకి తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కెమెరా: హరీష్ కన్నన్, సంగీతం: జిబ్రాన్.

ఏడడుగులు వేసిన చిన్నారి పెళ్లికూతురు

'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ఫేమ్ అవికా గోర్ ఇప్పుడు నిజ జీవితంలో పెళ్లి పీటలెక్కారు. సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త మిలింద్ చాంద్వానీతో ఆమె ఏడడుగులు వేశారు. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా గుర్తింపు సొంతం చేసుకున్న అవికా గోర్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారారు. తెలుగుతో పాటు కన్నడ, హిందీలో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటించారు. గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న మిలింద్, అవికా గోర్ జూన్‌లో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమికులు మంగళవారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



● మిలింద్ చాంద్వానీ, అవికా గోర్

పరాక్... వింటేజ్ స్టైల్!



● శ్రీ మురళి

శ్రీ మురళి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పరాక్'. హలేష్ కోగుండి దర్శకత్వంలో బ్రాండ్ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. బెంగళూరులోని బండి మహాకాళి ఆలయంలో మంగళవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకకు చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవ రాజు ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మురళి మాట్లాడుతూ- ''పరాక్' ఒక వింటేజ్ స్టైల్ సినిమా'' అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్‌రాజ్, కెమెరా: సందీప్ వల్లూరి.

వివాదాలు సృష్టించవద్దు! - ఫరా ఖాన్



● ఫరా ఖాన్

దర్శకురాలు ఫరా ఖాన్, హీరోయిన్ దీపికా పదుకోన్‌ల మధ్య అభిప్రాయభేదాలొచ్చాయని, అందుకే ఇన్‌స్టాలో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారన్నది బాలీవుడ్ టాక్. దీపిక కెరీర్‌లోని రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలు 'ఓం శాంతి ఓం' (2007), 'హ్యాపీ న్యూ ఇయర్' (2014)లో షారుక్ ఖాన్ హీరోగా నటించగా, ఫరా ఖాన్ దర్శకత్వం వహించారు. ఇలా దీపిక-ఫరాల మధ్య మంచి అనుబంధం ఉంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా సినిమాల్లో హీరోయిన్స్ 8 గంటలే పని చేయాలన్నట్లుగా, 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' కాన్సెప్ట్ గురించి దీపిక మాట్లాడారు. ఈ కాన్సెప్ట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఓ షోలో పాల్గొన్న ఫరా ఈ 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' గురించి కాస్త వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో దీపికను ఉద్దేశించే ఫరా ఖాన్ అలా మాట్లాడారని, అందుకే వీరిద్దరూ ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో అయ్యారని ప్రచారమవుతోంది. ఈ ప్రచారంపై ఫరా స్పందించారు. ''హ్యాపీ న్యూ ఇయర్' సినిమా షూటింగ్ సమయంలోనే నేను, దీపిక ఇన్‌స్టాలో కాకుండా డైరెక్ట్ మెసేజ్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడాలనుకున్నాం. అప్పుడే మేం ఒకరినొకరం అన్‌ఫాలో అయ్యాం. కొన్ని వెబ్ పోర్టల్స్ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు'' అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో ఫరా షేర్ చేశారు. ఈ స్టోరీకి ఓ నమస్కారం ఎమోజీతో దీపిక స్పందించారు.

పల్లెటూరి నేపథ్యంలో...



● స్వప్న, రామసత్యనారాయణ

తిలక్ రాజ్, తుంగ జంటగా నటించిన చిత్రం 'తాళికట్టు శుభవేళ'. వి. జగన్నాథ రావ్ దర్శకత్వంలో బి. అరుణ్ కౌశిక్ నిర్మించిన ఈ సినిమాలో దేవరాజ్ ముఖ్యపాత్ర పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులు గుప్త, తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి హాజరై, 'తాళికట్టు శుభవేళ' వీడియో సాంగ్స్, ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం రామసత్యనారాయణ మాట్లాడుతూ- ''కొత్త తరానికి విలువలు నేర్పే మంచి కుటుంబ కథగా ఈ చిత్రం నిలిచిపోతుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు. ''పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. గ్రామీణ శైలిని ప్రతిబింబించే కథతో, వినోదం, భావోద్వేగాన్ని కలగలిపి రూపొందించాం'' అన్నారు వి. జగన్నాథ రావ్.